క్లుప్తంగా

ముక్కంటి సేవలో ఐఏఎస్ మాజీ అధికారి

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం తెలంగాణ రాష్ట్ర ఐఏఎస్ మాజీ అధికారి బీపీ ఆచార్య దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను చైర్మన్ అందజేశారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



నాగలాపురం: నాగలాపురం బజారువీధిలో వెలసి ఉన్న శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం 51వ దీప పూజను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అన్నదానం చేశారు. రాత్రి తిరు వీధుల్లో గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

మృతురాలి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం, కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని అముడూరు పంచాయతీ బండివానిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన వెంకటమ్మ కుటుంబానికి గురువారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి రూ.10 వేల నగదును అందించి చేయూత నిచ్చారు. అనారోగ్యంతో వెంకటమ్మ బుధవారం రాత్రి మృతిచెందింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు ఎమ్మెల్సీ, గున్నేరి కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, సాయం అందించారు. ఎంపీపీ గీత, సర్పంచ్‌లు సుబ్బమ్మ, రాజేశ్వరి, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్ పాల్గొన్నారు.

వేదాం చెరువు గండి పూడ్చివేత



తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం వేదాం పంచాయతీ బ్రాహ్మణ చెరువు ఎగువభాగంలో పడిన గండిని పూడ్చేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు. బ్రాహ్మణ చెరువు కింద 132 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువుకు ఎగువ భాగంలో ఉన్న అడవుల నుంచి వరదనీరు వస్తుండడంతో కట్టకు చిట్టచివరన గండి పడింది. ఇరిగేషన్ ఏఈ రాఘవేంద్ర ఆయకట్టు రైతులతో మాట్లాడి వెంటనే గండి పూడ్పించేందుకు జేసీబీని పంపారు. దీంతో జేసీబీ సాయంతో గండిని పూడ్చి వేశారు. గండి కారణంగా కొద్దిమోతాదులో మాత్రమే నీరు వెలుపలకు వెళ్లినట్లు, ప్రస్తుతం చెరువులోకి ఇంకా ఇన్‌ఫ్లో వస్తుండడంతో పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు నీటిని నింపుకునే అవకాశం ఉందని ఏఈ తెలిపారు.

సచివాలయాలకు క్రీడా పరికరాలు

సత్యవేడు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు రాష్ట్రప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించనుందని, జిల్లాకేంద్రం నుంచి మండలానికి చేరిన క్రీడా సామగ్రిని సచివాలయాలకు గురువారం అందజేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 15 నుంచి గ్రామ సచివాలయాల పరిధిలో ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు.

వరదయ్యపాళెంలో ..

వరదయ్యపాళెం: ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి మండలంలో 13 సచివాలయాలకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు పంచాయతీ కార్యదర్శులకు కిట్లను అందజేశారు. ఈవోపీఆర్డీ చిరంజీవి, పంచాయతీ ఈవో బసిరెడ్డి పాల్గొన్నారు.

కండలేరులో 13.023 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 13.023 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 1800 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. అలాగే హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఎకరాకూ పరిహారం

- మండలంలో ఎమ్మెల్యే ఆదిమూలం సుడిగాలి పర్యటన
- వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ
- కళత్తూరు రైతుల నష్టం సీఎం దృష్టికి



కేవీబీపురం : రాయపేడులో బాధితులకు నిత్యావసరాలను అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: తుపాన్ కారణంగా ఆశ్రయం కోల్పోయిన బాధిత రైతులను, కుటుంబాలను ఆదుకుంటామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. గురువారం మండలంలో తుపాన్ కారణంగా కొట్టుకుపోయిన రోడ్లు, వాగులు, వంకలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆరె, వగత్తూరు, రాయపేడు, పాతపాళెం, వేమళ్లపూడి, కళత్తూరు గ్రామాల్లో బాధితులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. కళత్తూరు రైతులకు జరిగిన నష్టంపై ఆయన అధికారులతో సమీక్షించారు. కళత్తూరు పంట భూముల్లో ఇసుక మేట వేయడంతో భారీగా నష్టపోయారని, జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా వివరించి ఆదుకోవాలని కోరారు. విషయాన్ని సీఎంను కలిసి విన్నవిస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వరదల కారణంగా 14 ఆర్‌అండ్‌బీ రోడ్లు, 24 పంచాయతీ రాజ్ పరిధిలోని బ్రిడ్జిలు, కల్వర్టులు, కాజ్‌వేలు, తూములు కొట్టుకుపోయాయని తెలిపారు. వాటిని పునరుద్ధరించేందుకు అధికారులు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయని, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలని అధికారులకు సూచించారు.

జలదిగ్బంధం నుంచి ఉపశమనం

మండలంలోని రాజులకండ్రిగ గిరిజన కాలనీ వాసులు వారం రోజులుగా జలదిగ్బంధంలోనే ఉన్నారని స్థానిక నేత కాటముని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. చుట్టూ పంట భూములు ఉన్న రైతులు అడ్డుకట్ట వేయడంతో గిరిజనులు బయటకు రాలేకపోతున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రెవెన్యూ సిబ్బందితో అడ్డుకట్టను తొలగింపజేసి, గిరిజనుల రాకపోకలకు మార్గం కల్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, నేతలు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, దశరథరామిరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రామాధవీరెడ్డి, గాలి దయాకర్‌నాయుడు, అరుల్, రమేష్, దేవళ్లమణి పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగ: పల్లమాల భూముల్లో ఇసుక మేటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బాధితులకు అండగా ప్రభుత్వం

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాన్ బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆయన గురువారం పల్లమాల, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద తుపాన్ బాధిత 103 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కేజీ పప్పు, కేజీ నూనె, ఉర్లగడ్డలు, ఉల్లిపాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు కోల్పోయిన వారికి కొత్త గృహాలను మంజూరు చేస్తామని, వర్షానికి దెబ్బతిన పంటలకు నష్టపరిహారం అందిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి, తహసీల్దారు భార్గవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రవి పాల్గొన్నారు. బాధితులకు తహసీల్దార్ మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించారు.

వేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు



గోపాల్‌రావు కాలనీలో మాట్లాడుతున్న ఎస్‌ఈ కృష్ణారెడ్డి

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో తుపాన్ ప్రభావంతో అస్తవ్యస్తమైన విద్యుత్ సరఫరాను యుద్ధప్రాతిపదికన సరిచేస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండల పర్యటనకు వచ్చిన ఎస్‌ఈని వరదయ్యపాళెం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడు మండలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఆ గ్రామా లన్నింటికీ విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఎస్‌ఈ మాట్లాడుతూ వీలైనంత త్వరగా పునరుద్ధరణ పనులు చేపట్టి నియోజకవర్గ వ్యాప్తంగా వందశాతం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వరదయ్యపాళెం పంచాయతీ గోపాల్‌రావుకాలనీ ఏర్పాటై పదేళ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం లేదని స్థానికుడు వినోద్‌యాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన ఆ సమస్యను ఎస్‌ఈకి వివరించారు. స్పందించిన ఎస్‌ఈ కాలనీని సందర్శించి, సమస్యపై స్థానికులతో మాట్లాడారు. 30 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫా ర్మర్ మంజూరు చేస్తూ కన్‌స్ట్రక్షన్ డీఈకి ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే పనులు చేపడతామని ఎస్‌ఈ పేర్కొన్నారు. దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, సర్పంచ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తగ్గని వరద ఉధృతి



ఉధృతంగా ప్రవహిస్తున్న కారణి ఏరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వర్షాలు పూర్తిగా ఆగిపోయినా కాళంగినది, కారణి ఏరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నదికి ఇరువైపులున్న గాంధీగిరిజనకాలనీ, మొక్కలచేను, సుద్దమిట్టగిరిజనకాలనీ, తహాసగర్ గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. పంట పొలాల కోసం కాళంగినది ఒడ్డున ఏర్పాటు చేసిన బోరు మోటార్లు వరద నీటి ప్రవాహంతో దెబ్బతిన్నాయి. కాటూరు, పల్లమాల, చిన్నయిగుంట, అరిగిలకండ్రిగ, జంబుగోళం. పాతకారణి గ్రామాల పొలాల్లో వర్షం నీరు నిలచి ఉంది. 150 ఎకరాల్లో చెరుకు, 1,500 ఎకరాల్లోని వరినారు, 170 ఎకరాల్లో మినుము, 3 వేల ఎకరాల్లోని వరి దెబ్బతిన్నట్లు అంచనా.

చేనేత మగ్గాల పరిశీలన

వెంకటగిరి రూరల్ : వర్షాలకు వెంకటగిరిలో చేనేత మగ్గాల గుంతల్లోకి నీరు చేరడంతో పనులు నిలిచిపోయాయి. కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో జౌళిశాఖ డెవలప్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్లు గురువారం కౌన్సిలర్ నారాయణతో కలిసి 4వ వార్డు సాలికాలనీలో పర్యటించి చేనేత మగ్గాలను పరిశీలించారు. నీరు చేరిన చేనేత మగ్గాలు, నూలు, డ్యామేజ్ అయిన మగ్గాల వివరాలను నమోదు చేసుకున్నారు. నష్టం వివరాలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని డీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తమ వార్డులోని చేనేత మగ్గాలను పరిశీలించారు.

ప్రజల భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ నిర్వహణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: జలజీవన్ మిషన్ పథకం నిర్వహణలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, తొమ్మిది మంది మహిళ సభ్యుల భాగస్వామ్యంతో జగనన్న కాలనీలు, గ్రామాల్లో ఇంటింటికీ కొళాయి సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం జరిగింది. 17 సచివాలయాలయ పరిధిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో ఇంటింటికీ కొళాయి వసతి, రోడ్ల ఆధునీకరణ పనులు చేపట్టాలని సూచించారు. సంఘాల మహిళలు తొమ్మిదిమంది, సచివాలయ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కలసి నూతనంగా బ్యాంకులో ఖాతా ప్రారంభించాలన్నారు. నీటి వసతికి విడుదలయ్యే నిధులను సక్రమంగా వినియోగించాలని తెలిపారు. ప్రతి ఇంటా మరుగుదొడ్డు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు విజయవంతం చేయాలని తెలిపారు. ఈఓపీఆర్డీ ముని రవికుమార్, ఎంపీఓ కె. రవి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగనన్నే రావాలి





శ్రీకాళహస్తి: సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న లబ్ధిదారులు, తొట్టంబేడు: పోలిలో జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

శ్రీకాళహస్తి: అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని జయరామరావువీధిలోని సచివాలయంలో గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. తొలుత సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం ఎందుకు అవసరమో వివరించారు. నాయకులు షేక్‌ఫజల్, పఠాన్ ఫరీద్, కరీముల్లా కాలేషా, లాల్‌బాషా, షాహి, జమీర్, 16, 18వ వార్డు ప్రజలు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంట: పేదల సంక్షేమం కొనసాగాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. రేణిగుంట సచివాలయం–2లో గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, అందిన నవరత్న ఫలాల వివరాలతో కూడిన బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలనలో జీఎస్‌డీపీ వృద్ధిరేటు విషయంలో మన రాష్ట్రం దేశంలో 22వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం జగనన్న పాలనలో మొదటిస్థానంలో ఉందన్నారు. జగనన్న పాలనలో 2,13,662 ప్రభుత్వ ఉద్యోగాలిచ్చారని తెలిపారు. రూ.11,700 కోట్లు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చారన్నారు. పేదరికం నిర్మూలనే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ నేరుగా పేదల ఖాతాల్లో నగదు జమ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సొంత నిధులు వెచ్చించి అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తూ పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. పేద కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే రూ.10వేలు అందించడం, ముస్లిం పేదలకు వివాహ సమయంలో మేనమామ సాంగ్యం, పేద విద్యార్థుల చదువులకు సాయం, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందించడం ఈ కోవలోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, సర్పంచ్ నగేషం, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు రసూల్, కోఆప్షన్ సభ్యుడు హసన్ సాహెబ్, పంచాయతీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంట: మాట్లాడుతున్న ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి

జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని పోలి పంచాయతీలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. రానున్న ఎన్నికల్లోను జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరాన్ని వివరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. చెర్లోపల్లి సచివాలయ కన్వీనర్ వెంకటేష్, గుణ, అశోక్, ప్రకాష్, కోటి, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గురువారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామానికి చెందిన ఎస్ ఉషకు రూ.30వేలు, రేణిగుంట మండలం దొడ్లమిట్టకు చెందిన మునిరెడ్డికి రూ.3లక్షలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతో మంది పేదలకు సీఎం జగన్‌మోహన్‌రెడి వైద్యం అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద బాసటగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, తిరకాల మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

శబరిమలై యాత్రకు ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన అయ్యప్పస్వామి భక్తులకు శబరిమలై యాత్రకు వెళ్లేందుకు కావాల్సిన రవాణ, భోజన నిమిత్తం గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.లక్ష అందజేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్పస్వామిని దర్శించుకుని, శబరిమలై యాత్రను శుభప్రదంగా ముగించుకు రావాలని కోరారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మధు

సాగు పనులకు రైతుల సమాయత్తం



కాంపాళెంలో దుక్కి దున్నుతున్న రైతు



కాటూరులో వరి విత్తనాలు చల్లుతున్న రైతు

బుచ్చినాయుడుకండ్రిగ: తుపాన్‌తో నాలుగు రోజుల పాటు కురిసిన భారీ వర్షంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వర్షపు నీరు భారీగా చెరువులకు చేరడంతో జల కళ సంతరించుకుంది. రైతులు పంటల సాగుకు పొలాలను దుక్కిలు దున్నుతున్నారు. వరినార్లు పోస్తున్నారు. ఈ రబీ సీజన్‌లో మండలంలో సుమారు 9 వేల ఎకరాల్లో వరి, 500 ఎకరాలలో చెరకు, 1500 ఎకరాలలో వేరుశనగ సాగు చేస్తారు. వ్యవసాయ బావులు, బోరు మోటార్లల్లో భూగర్భజలాల మట్టం పెరగడంతో మెట్ట భూముల్లోను పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు.

దివ్యాంగుల్లో మనోస్థైర్యాన్ని నింపాలి

నారాయణవనం: దివ్యాంగ పిల్లల్లోని ప్రతిభను గుర్తించి, ప్రతిభా వంతులుగా ఎదగడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రధాన ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వైకల్యాన్ని లోపంగా చూడకూడదన్నారు. వారిలో మనోస్థైర్యాన్ని నింపాలని తెలిపారు. ఎంఈవోలు ప్రభాకర్ రాజు, గోవిందస్వామి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల కోసం ప్రభుత్వం భవిత కేంద్రాన్ని నడుపుతోందని తెలిపారు. ఇక్కడ ఫిజియోథెరపీ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమగ్ర శిక్ష శాఖ సరఫరా చేసిన ట్యాబ్‌లను, ట్రై సైకిళ్లను, స్టీల్ ప్లేట్లను అందజేశారు. నగరి లయన్స్ క్లబ్ సభ్యుడు జీవన్, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సులోచన, ప్రజాప్రతినిధులు చిన్నదొరై, మణిరెడ్డి, మోహన్, గణేష్‌బాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ట్రైసైకిళ్లు అందుకున్న దివ్యాంగులతో సుమన్‌కుమార్, అధికారులు

తుపాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ





నారాయణవనం: వస్తువులను అందిస్తున్న సుమన్‌కుమార్, పిచ్చాటూరు: సరుకులు, ఆర్థిక సాయం పంపిణీ

సత్యవేడు: పట్టణంలోని నాల్గవ సచివాలయ పరిధిలోని కోమటి గుంట, ఇందిరానగర్‌లలో తుపాన్ బాధితులకు గురువారం 25 కేజీల బియ్యం, కిలో నూనె, కిలో కంది పప్పు వంతున జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి, సర్పంచ్ పి.మంజుల అందజేశారు. గురువారం సాయత్రం 41 కుటుంబాలకు చెందిన మహిళలకు సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ బి.సోమశేఖర్, వీఆర్‌ఓ ఇళయరాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు పళణి, రాబిన్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం మండలంలో..

నారాయణవనం: తుపాన్ ప్రభావంతో దళితవాడ జలదిగ్బంధంలో చిక్కుకున్న మండలంలోని పాలమంగళం దక్షిణపుకండ్రిగ దళితవాడ వాసులకు గురువారం సాయంత్రం నగదును, నిత్యావసర వస్తువులను జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. పునరావాస కేంద్రంలో తలదాచుకున్న 149 దళిత కుటుంబాలకు మూడు రోజుల పాటు భోజన, ఇతర వసతులను కల్పించారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో సహాయకాలు పంపిణీ చేశారు. నగదుతో పాటు ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కిలో చొప్పున కందిపప్పు, నూనె అందజేశారు. తహసీల్దార్ ప్రమీల, ఏవో గుణశేఖర్, ఎంఈవో గోవిందస్వామి, సర్పంచ్‌లు సాయిరవి, ప్రేమలతా రాజారెడ్డి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చాటూరు మండలంలో..

పిచ్చాటూరు: మండలంలోని శివగిరి ఆదిఆంధ్రవాడ తుపాన్ బాధితులకు ప్రభుత్వ ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. బుధవారం శివగిరిలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఆదిఆంధ్రవాడ జల దిగ్బంధంలో చిక్కుకుందన్నారు. వెంటనే 38 బాధిత కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించామన్నారు. ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కంది పప్పు, లీటర్ పామాయిల్, వెయ్యి రూపాయలు చొప్పున 75 మందికి ఆర్థిక సాయాన్ని మంజూరు మంజూరు చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతి రాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు, సర్పంచ్ కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేత చెంచుబాబు నాయుడు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మండలంలో..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం వేదాం పంచాయతీ పరిధిలోని భైరవకోన ఎస్టీకాలనీలో తుపాన్ బాధితులకు గురువారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మునిశేఖర్ బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. మండల కోఆర్డినేటర్ నాగమణి, వలంటీర్లు వెంకటేష్, హేమ పాల్గొన్నారు.

నాగలాపురం మండలంలో..

నాగలాపురం: మండలంలోని కొట్టకాడు గ్రామంలో వరద నీరు ప్రవహించి ఇళ్లల్లోకి నీరు చేరింది. ప్రజలు ఇళ్లల్లో ఉండలేక, తినడానికి తిండిలేక అవస్థలు పడుతున్నారు. సర్పంచ్ ఏలుమలై స్పందించి బాధిత కుటుంబాలకు గురువారం భోజన వసతి కల్పించారు. అధికారులతో మాట్లాడి ఇళ్ల మధ్య నిలిచిన నీటిని బయటకు తోడేందుకు చర్యలు తీసుకున్నారు. బాధితులను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు.





సత్యవేడు: సరుకులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, శ్రీకాళహస్తి: సరుకుల పంపిణీ